క్లుప్తంగా

23న దేవాలయ వార్షికోత్సవం



ముస్తాబవుతున్న దేవాలయం

దేవరకొండ : ఈనెల 23వ తేదీన దేవరకొండ పట్టణంలోని శ్రీ భక్తమార్కండేయస్వామి దేవాలయ షష్టమ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సిరిపోతు శ్రీరాములు, సిరందాసు శ్రీనివాసులు తెలిపారు. 23న ఉదయం మంగళ తోరణం, సుప్రభాత సేవ, గణపతిపూజ వంటి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. వార్షికోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

మసీద్‌కు రూ.లక్ష విరాళం



విరాళం అందిస్తున్న కరుణాకర్‌రావు

గుర్రంపోడు : మండలకేంద్రంలోని మసీద్‌కు వీకేఆర్ కన్‌స్ట్రక్షన్ అధినేత, జిల్లా కాంగ్రెస్ నాయకుడు వెల్లపూడి కరుణాకర్‌రావు రూ.లక్ష విరాళాన్ని ఆదివారం మసీద్ నిర్వహించిన కార్యక్రమంలో కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ విరాళంలో మస్జీద్ ఇమామ్ మౌలానా క్వార్టర్‌ను నిర్మించనున్నారు. ఈ సందర్భంగా కరుణాకర్‌రావు మాట్లాడుతూ సమాజ సేవలో భాగంగా తన వంతుగా అన్ని మతాల ప్రార్థనామందిరాల నిర్మాణాలు, మౌలిక వసతులకు ఆర్థికసాయం అందిస్తున్నట్లు తెలిపారు. కరుణాకర్‌రావును కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

దుగ్యాలలో ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని దుగ్యాలలో నల్లగొండ సూర్య ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా గ్రామంలోని 210 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, నిత్యం వ్యాయామం,పౌష్టికాహారం తీససుకుంటూ ఉండాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు వైద్య సేవలు అందించడంపై సేవ చేసుకొనే అదృష్టం కలిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది,గ్రామస్థులు తదితరులున్నారు.

ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఎం. శ్రీనివాస్‌రెడ్డి



నియామక పత్రం అందుకుంటున్న ఎం. శ్రీనివాస్‌రెడ్డి

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాస్‌రెడ్డి ఎన్నియ్యారు. ఆదివారం స్థానిక నల్లగొండ రోడ్డులో ఏర్పాటు చేసిన ప్రెస్ క్లబ్ కార్యాలయంలో ఈ మేరకు టీయూడబ్ల్యూజే నియోజకవర్గ అధ్యక్షులు గాదె గిరిధర్, ఆంధ్రప్రభ సీనియర్ రిపోర్టర్ జూలూరి వెంకటయ్య ఆధ్వర్యంలో నూతన ప్రెస్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా దుండిగళ్ల అశోక్, సంగం అధ్యక్షునిగా ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షునిగా సయ్యద్‌పాషా, ప్రధాన కార్యదర్శిగా బూడిద శ్రీనివాస్‌యాదవ్, సహాయ కార్యదర్శిగా కుంభం యాదగిరిగౌడ్, కోశాధికారిగా బొమ్మ వెంకటరమణయాదవ్, కార్యవర్గ సభ్యులుగా జనార్ధన్, కుందారపు సాయిలను ఎన్నుకున్నారు.

హనుమాన్ జయంతిని జయప్రదం చేయాలి

హుజూర్‌నగర్ : జూన్ ఒకటవ తేదీన నిర్వహించబోయే హనుమాన్ జయంతిని విజయవంతం చేయాలని అభయాంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని గోవిందపురంలో గల శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆలయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ జయంతి కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రంగబత్రాచార్యులు, కమిటీ సభ్యులు కె.వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, గౌరవ సలహాదారులు కోల నాగేశ్వరరావు, శ్రీనివాస్ గుప్త, కమిటీ సభ్యులు పిచ్చయ్య, ఆదినారాయణ, శ్రీనివాస్, వీరబాబు, ధనుంజయ, రాజు, రవీందర్‌రెడ్డి, వేణు, గోపి, నరేష్, ప్రభాకర్, పాల్గొన్నారు.

వీధి కుక్కల స్వైరవిహారం

- పెద్దవూర మండలంలో ఏడాదిలో 610 మందికి పైగా టీకాలు
- ప్రజలపై విరుచుకుపడుతున్న శునకాలు
- వేసవి నేపథ్యంలో పరిస్థితి మరింత తీవ్రం
- ఏటా పెరుగుతున్న కుక్కకాటు బాధితులు
- జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు



పెద్దవూరలో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు





పోతునూరులో కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన మల్లయ్య, విశ్వనాథం

పెద్దవూర : మండలంలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. గుంపులుగా రోడ్లు, ప్రధాన వీధులు, గల్లీల్లో తిరుగుతూ పాదచారులు, వాహనదారులపై విరుచుకుపడుతున్నాయి. సహజంగానే వేసవిలో శునకాలు వెర్రీగా ప్రవర్తిస్తూ ప్రజలను కరుస్తుంటాయి. ప్రతీరోజు పదుల సంఖ్యలో బాధితులు కుక్కకాటుకు గురై చికిత్స కోసం ఆస్పత్రులకు వస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు పూర్తిస్థాయిలో చేయకపోవడంతో వాటి సంఖ్య ఏటేటా పెరుగుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఒక్కనెలలోనే 142మందికి టీకాలు

సాధారణ రోజుల్లో కంటే వేసవిలోనే కుక్కకాటు ఘటనలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. బాధితుల సంఖ్య ఏటేటా పెరుగుతుంది. పెద్దవూర మండలంలో నెలకు సరాసరి 38 మంది కుక్కకాటుకు గురయ్యారు. మండలంలో 2023 నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు 610 మంది రేబీస్ టీకాలు తీసుకున్నట్లు డాక్టర్ నగేష్ తెలిపారు. వీరిలో పురుషులు 410 మంది కాగా, మహిళలు 200 మంది ఉన్నారు. గత ఏప్రిల్ నెలలోనే 142 మంది రేబీస్ టీకాలు వేయించుకున్నట్లు తెలిపారు.

ఒకేరోజు 14 మందికి కుక్కకాటు..

మండలంలోని పోతునూరు గ్రామంలో ఒకేరోజు పిచ్చికుక్క స్వైరవిహారం చేసి 14 మందిని కరిచి తీవ్రంగా గాయాలు చేసింది. ఇంటి ముందు నిద్రిస్తున్న మారేపల్లి మల్లయ్య, ఇనుపాముల విశ్వనాథంలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం సాగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించి చికిత్స చేయించారు. గత నెలలో మండలంలోని బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన యువ నాయకుడు తుడుం నరేందర్ రేబీస్ వ్యాధితో మృతి చెందాడు. దీంతో ఎక్కడ వీధి కుక్కలు కరుస్తాయో అని మండల ప్రజలు బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు.

వేసవితాపాన్ని తట్టుకోలేక..

వేసవిలో ఉక్కపోత వల్ల జంతువుల్లోనూ ప్రత్యేక లక్షణాలు కనిపిస్తాయని వైద్యులు అంటున్నారు. వేసవి తాపాన్ని తట్టుకోలేక కొన్ని శునకాలు కనిపించిన వారిని కరిచేందుకు ప్రయత్నించడం, వాటి జోలికి వెళ్తే మరింతగా ఎగబడి తీవ్రంగా గాయపర్చడం చేస్తాయి. ఇటీవల వీధి కుక్కలతో పాటు పెంపుడు కుక్కలు దాడులు చేస్తున్నాయి. ఇళ్లల్లో శునకాలను పెంచుకునేవారు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

వ్యాధిని ఇలా గుర్తించవచ్చు..

రేబీస్ సోకిన కుక్కలు నాలుకను బయటకు చాపి, సొల్లుకారుస్తూ మతిస్థిమితం లేకుండా తిరుగుతుంటాయి. కనిపించిన ప్రతి వస్తువును చివరకు రాళ్లను కూడా కొరకేందుకు ప్రయత్నించడం, నడిచేటప్పుడు తడబడుతూ, తూలుతూ, తోక ఆడించ లేని స్థితిలో ఉంటాయి. నోరు, గొంతు, కండరాలకు పక్షవాతం వచ్చి కుక్క అరుపులో మార్పు వస్తుంది. చివరకు నీటిని కూడా తాగలేని స్థితిలో ఉంటూ.. ఊపిరి పీల్చుకోవడం కష్టంగా మారి 5 నుంచి 7 రోజుల్లో మరణిస్తుంది. మనుషులకు రేబీస్ సోకితే దవడ, గొంతు కండరాలకు పక్షవాతం వచ్చి నీటిని తాగలేరు. రోగి నీటిని చూసినా, నీటి శబ్దం విన్నా భయకంపితులవుతారు. కుక్క కాటుతో 19 రకాల వ్యాధులు వస్తాయని పశు వైద్యాధికారులు చెబుతున్నారు. రేబీస్, మెదడువాపు, బ్రూసెల్లోసిస్, క్షయ, సాల్మ్ నెల్లోసిస్, లెప్టోస్పైరిన్, ప్లేగు, బర్డ్ ఫ్లూ, ఆంత్రాక్స్ వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. వెటర్నరీ అధికారులకు ఫిర్యాదు చేస్తే శునకాలను తీసుకెళ్లి, రేబీస్ వ్యాక్సిన్ వేస్తారు.

కుక్కల బెడద ఎక్కువైంది



ఏ వీధిలో చూసినా పదుల సంఖ్యలో గుంపులు గుంపులుగా దర్శనమిస్తున్నాయి. రాత్రి పూట నడుచుకుంటూ వెళ్లేవారితో పాటు బైక్ మీద వెళ్లినా వెంటపడి కరుస్తున్నాయి. పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్ల వెంట బైక్‌లు, కార్ల వెంట పడుతుండటంతో ద్విచక్రవాహనదారులు కింద పడి గాయాల బారిన పడుతున్నారు. కుక్కల బెడదను నివారించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

-కిలారి మురళీయాదవ్, పెద్దవూర

'తోపుచర్ల-పుచ్చకాయలగూడెం' లిఫ్టు పూర్తి చేస్తాం

- మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



తోపుచర్లలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మాడుగులపల్లి : తోపుచర్ల-పుచ్చకాయలగూడెం లిఫ్టు నిర్మాణం పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని తోపుచర్ల గ్రామానికి వచ్చిన ఆయన స్థానిక రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈ ప్రాంతానికి సాగునీటిని అందించేందుకు లిఫ్టు నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని రైతులు ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఆయన మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు కాంగ్రెస్ పార్టీ గ్రామ సీనియర్ నాయకుడు వల్లపుదాసు కాంతయ్య సతీమణి పద్మ మృతి చెందడంతో ఆమె మృతదేహం వద్ద ఎమ్మెల్యే నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, మిర్యాలగూడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్జున్, తాజామాజీ సర్పంచ్ యాదయ్య, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ పట్టా అందుకున్న చింతపల్లి వాసి



పరిశోధనా గ్రంథాన్ని సమర్పిస్తున్న మల్లికార్జున్

చింతపల్లి: మండల పరిధిలోని నసర్లపల్లి గ్రామానికి చెందిన చెట్టుపల్లి కిష్టమ్మ, రాములు దంపతుల కుమారుడు చెట్టుపల్లి మల్లికార్జున్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి రాజనీతి శాస్త్రంలో ఆదివారం పీహెచ్‌డీ పట్టా అందుకున్నాడు. అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో భాగంగా ఈశాన్య భారత దేశంలో సాయుధ దళాల తిరుగుబాట్లు, దేశ అంతర్గత భద్రతకు సవాళ్లు' అనే అంశంపై ప్రొఫెసర్ రాంరెడ్డి పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను పీహెచ్‌డీ పట్టా అందుకున్నట్లు ఆయన తెలిపారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నల్లగొండ టూటౌన్: వ్యాధుల పట్ల పిల్లలు, పెద్దలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ జయకుమార్ అన్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్విమ్మింగ్ పూల్‌కు వచ్చే వారికి మెడికల్ క్యాంపు నిర్వహించి స్కిన్ ఎలర్జీకి సంబంధించిన పరీక్షలు చేసి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు స్విమ్మింగ్ చేసే వారికి స్కిన్ ఎలర్జీ వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి మక్బూల్ అహ్మద్, సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, నజీరుద్దీన్ పాల్గొన్నారు.



పిల్లలను పరీక్షిస్తున్న డాక్టర్ జయకుమార్

దుర్గాప్రసాద్ మహారాజ్‌కు ఓటు వేయండి



హాలియా : మాట్లాడతున్న మామిడి సైదయ్య

హాలియా : వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి బరిగెల దుర్గాప్రసాద్ మహారాజ్‌కి ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ సాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మామిడి సైదయ్య అన్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో భాగంగా ఆదివారం హాలియా పట్టణంలో నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులతో సమస్యలు పరిష్కారం కావని, ప్రజల పక్షాన పోరాడే అభ్యర్థికి తొలిప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ఈనెల 22న నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించే బైక్ ర్యాలీకి ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారధన్ మహారాజ్ హాజరవుతున్నారని, ఈ కార్యక్రమంలో విద్యావంతులు, మేధావులు, నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అనుముల మండల కన్వీనర్ రవిమహారాజ్, నిడమనూరు, గుర్రంపోడు మండలాల కన్వీర్లు జిల్లా రమేష్ మహారాజ్, మహేష్ మహారాజ్, తిరుమలగిరి మండల ఇంచార్జ్ గోవర్ధన్, నాగరాజ్, రమేష్, శంకర్, కొండల్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఐద్వా నేతలు

మిర్యాలగూడ అర్బన్ : మండలంలోని ఉట్లపల్లి గ్రామంలో మైనర్ బాలిక ఆత్మహత్యకు కారణమైన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలేబోయిన వరలక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం ఉట్లపల్లి గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం ఆమె మాట్లాడారు. మహిళలపై రోజురోజుకు దాడులు పెరిగి పోతున్నాయని, దళిత బాలికలను హింసించి ఆమె చావుకు కారణమై ఆ యువకుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ తో పాటు హత్యానేరం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట ఐద్వా సీనియర్ నాయకురాలు గాదె పద్మ, మండల కార్యదర్శి హుస్సేన, కౌసల్య, పూలమ్మ తదితరులున్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం

చింతపల్లి : వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని చింతపల్లిలో ఆ పార్టీ నాయకులు ఆదివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు మాట్లాడారు. చింతపల్లి మండల కేంద్రంలోని 588, 589 బూతుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శివర్ల రమేశ్‌యాదవ్, గోపిడ అనిల్‌రెడ్డి, బొడ్డు మహేశ్, సైదులు, కుకుడపు రామకృష్ణ, గొడుకు శ్రీనివాస్, మోర వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా రాకేష్‌రెడ్డిని గెలిపించాలి

మాడుగులపల్లి : నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ మాడుగులపల్లి మండలాధ్యక్షుడు పాలుట్ల బాబయ్య కోరారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు, నిరుద్యోగుల తరపున పోరాడేందుకు ఉన్నత విద్యావంతుడైన రాకేష్‌రెడ్డికి అవకాశం ఇవ్వాలని పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. పట్టభద్రుల ఇంటింటికీ వెళ్లి పార్టీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించాలని సూచించారు.

మట్టపల్లి ఆలయానికి వాటర్ కూలర్ బహూకరణ



వాటర్ కూలర్‌ను ప్రారంభిస్తున్న యూనియన్ బ్యాంక్ మేనేజర్లు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా హుజూర్‌నగర్ మేనేజర్ బాలకృష్ణ, రీజినల్ మేనేజర్ ఖమ్మం వై.హనుమంతరెడ్డిలు రూ.50 వేల విలువ గల వాటర్ కూలర్‌ను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీస్వామివారి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులు చల్లటి తాగునీరు తాగాలని ఉద్దేశంతో ఈ వాటర్ కూలర్ బహూకరించినట్లు తెలిపారు. అనంతరం దాతలను ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లి రావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు సత్కరించారు. కార్యక్రమంలో అర్చకులు బ్రహ్మాచార్యులు, కిలారు శ్రీనివాసరావు, ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలతో నైపుణ్యాల పెంపు



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

చిట్యాల: విద్యార్థుల్లో క్రీడా, విజ్ఞాన నైపుణ్యాలను పెంపొందించేందుకు వేసవి శిబిరాలు దోహదపడతాయని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలో గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వివిధ క్రీడాంశాలపై, గణితం, ఇంగ్లిష్, తెలుగు ఇతర సబ్జెక్టుల్లో విజ్ఞానాన్ని పెంపొందిందుకు ఏర్పాటు చేసిన వేసవి కాల శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆదివారం ఆయన నల్లగొండ జిల్లా గ్రంథాలయ మాజీ అధ్యక్షుడు గాదె వినోద్‌రెడ్డి కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెస్, చిత్రలేఖనంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాలను అన్ని గ్రామాల్లో నిర్వహించాలని సూచించారు. ఉచిత శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసిన గ్రంథాలయ అధ్యక్షుడు అనుముల శ్రీనువాస్‌ను అభినందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ వ్యవస్థాపక సభ్యులు లక్ష్మణాచారి, అంజయ్య, శ్రీకాంత్, శ్రీకాంత్, ఆనంద్, అంజయ్య, రవి, గోపికృష్ణ, పాల్గొన్నారు.

ఆదర్శనేత సుందరయ్యకు నివాళి



మిర్యాలగూడ : సుందరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



హాలియా : సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మిర్యాలగూడ : పేదల కోసం నిరంతరం పోరాడిన పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను ప్రతి ఒక్కరూ సాధించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ కోరారు. ఆదివారం 39వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఈదులగూడెం వద్ద ఉన్న సుందరయ్య విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు జగదీశ్చంద్ర, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, రాగిరెడ్డి మంగారెడివ్వ, పరుశురాములు, శశిధర్‌రెడ్డి, వరలక్ష్మీ, తిరుపతి రామ్మూర్తి, ఎండీ.అంజాద్, అయూబ్, సీతారాములు, వినోద్‌నాయక్, సత్యనారాయణరావు, రొండి శ్రీనివాస్, సైదులు, అరుణ, పూలమ్మ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిజమే మానవాళికి దిక్సూచి

మిర్యాలగూడ అర్బన్ : నేటి సమాజంలో అజేయమైన కమ్యూనిజమే మానవాళికి దిక్సూచిగా మారిందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేశ్ అన్నారు. ముందుగా పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, శశిధర్‌రెడ్డి, బావండ్ల పాండు, పరశురాములు, రామ్మూర్తి, మంగారెడ్డి, పోలేబోయిన వరలక్ష్మి, అయూబ్, జగదీష్‌చంద్ర, సత్యనారాయణ, పాపానాయక్, సైదులు, రామారావు, పాషా తదితరులున్నారు.

వేములపల్లి : తన చివరి శ్వాస వరకు పేద, బడుగు బలహీనవర్గాల కోసం కృషిచేసిన మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య అని వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని అన్నారు. ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాల్వాయి రాంరెడ్డి, వరలక్ష్మీ, శ్రీనివాస్, రాధా, సుకన్య, వెంకన్న, సైదులు పాల్గొన్నారు.

సుందరయ్య స్ఫూర్తితో ఉద్యమించాలి

హాలియా : కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్యను స్ఫూర్తిగా తీసుకుని ఉద్యమించాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కున్‌రెడ్డి నాగిరెడ్డి కోరారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం హాలియా పట్టణంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్ర పటానికి ఆయన పూలమాల నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి కారంపూడి ధనమ్మ, పెద్దవూర సీఐటీయూ నాయకులు షేక్ బషీర్, సీపీఎం మండల కమిటీ సభ్యులు రెబెల్లి వెంకటేశం, భవన నిర్మాణ అధ్యక్షుడు సురేష్, ఉపాధ్యక్షుడు వెంకటయ్య, షేక్ ఖాసీం, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కోరే రమేష్, నాయకుఉ వర్షిత్ తదితరులు ఉన్నారు.

దేవరకొండ : కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని ఆదివారం దేవరకొండ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి నల్లా వెంకటయ్య సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. సుందరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిజిలి లింగయ్య, యాదగిరి, శ్రీను, బుడిగ వెంకటేష్, రహీం తదితరులున్నారు.



మిర్యాలగూడ అర్బన్ : వర్ధంతి సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు



వేములపల్లిలో..



దేవరకొండ : సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీపీఎం నాయకులు

జాతరలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక



జాతరలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : జాతరలు తెలంగాణ సంస్కృతీ, సాంప్రదాయాలకు ప్రతీక అని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం దామరచర్ల మండలంలోని బాపూజీనగర్‌లో నిర్వహించిన శ్రీబంగారు మైసమ్మతల్లి జాతరలో ఆయన డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను కలిగి ఉండాలన్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతుగా సహకరిస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు స్కైలాబ్‌నాయక్, నాగునాయక్, బెజ్జం సాయి, సిద్ధునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వేములపల్లి : మండలంలోని రావులపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2009- 10 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు ఆ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా గత స్మృతులను గుర్తుకు చేసుకోని ఆహ్లాదంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్‌నాయక్, ఉపాధ్యాయులు యోగీశ్వర్, సత్తార్, గుడిపాటి కోటయ్య, రామచంద్రయ్య, దామోదరచారి, దారం శ్రీనివాస్, బచ్చలకూరి సైదులు, మణిభూషణ్‌రెడ్డి, మక్లానాయక్, శ్రీనయ్య, పూర్వ విద్యార్థులు వినోద్, భిక్షం, లింగస్వామి, సందీప్, సాధన, రూప, ప్రియాంక, నవీన్, అనిల్, అఖిల్, కవిత, పుష్ప, రాజేశ్వరి, సాయి, ఇందుమతి, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చు



రక్తదానం చేస్తున్న రషీద్

హుజూర్‌నగర్ : రక్తదానం చేసి మరొకరి ప్రాణాలను కాపాడొచ్చని డీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ దగ్గుపాటి బాబురావు అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో దుర్గా అనే మహిళకు ఆపరేషన్ నిమిత్తం ఓ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో డీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మున్సిపల్ పంపు ఆపరేటర్ షేక్ రషీద్ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ అమ్మ మనిషికి జన్మనిస్తే ఆ మనిషికి రక్తదానంతో మరొకరు పునర్జన్మ ఇస్తాడని అన్నారు.

నేడు కాంగ్రెస్ పార్టీ సమావేశం

నల్లగొండ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో భాగంగా సోమవారం ఉదయం 9గంటలకు నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో నియోజకవర్గ స్థాయి సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.